ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
శనివారం 1 జూన్ 2024



రాని నిధులకు ఆడిట్..!

- పాఠశాలలకు, ఎంఆర్సీలకు రెండేళ్లుగా విడుదల కాని నిర్వహణ గ్రాంట్లు
- అయినా.. ఆడిట్ చేయించుకోవాల్సిందేనంటున్న అధికారులు
- సొంత డబ్బులతో పాఠశాలల ఖర్చులను నెట్టుకొస్తున్న హెచ్ఎంలు
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయులు



ఎర్రగుంట్ల, మే 31: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు.. అనేలా విద్యాశాఖలో అధికారుల తీరు ఉంది. రాని నిధులకు కూడా ఆడిట్ చేయించుకోవాల్సిందే అంటూ హుకుం జారీ చేయడం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండేళ్లుగా పాఠశాలల నిర్వహణకు సంబంధించిన నిధులు ఒక్క రూపాయి కూడా రాలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయినా సరే.. రికార్డులు తెచ్చుకుని ఆడిట్ చేయించుకోవాల్సిందేనని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించడంతో చేసేదిలేక ఉపాధ్యాయులు చంకలో ఉత్త ఫైల్స్ పెట్టుకుని సంబంధిత ఆడి ట్ అధికారుల వద్దకు వెళ్లి నిల్ అని రాయించుకుని వాపస్ వస్తున్నారు. 2021 ఆడిట్ ఫైల్స్ తెచ్చుకోండని ఆడిట్ అధికారులు ఉచిత సలహా ఇవ్వడం తో కొందరు ఆ ఫైల్స్ తీసుకెళ్లి ఆడిట్ చేయించుకున్నారు. ఈ సంబడానికి ఇంతదూరం ఖర్చులు పెట్టుకుని రావాల్నా అంటూ కొందరు ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. అసలే రెండేళ్లుగా నిధుల రాకపోవడంతో సొంతంగా వేలకువేలు ఖర్చుచేసి లబోదిబోమంటున్న ఉపాధ్యాయులకు ఆడిట్ పుండుమీద కారం చల్లినట్లుగా ఉంది. వివరాల్లోకెళితే...

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు, ఎంఆర్సీలకు 2022-2023, 2023-2024 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్కూల్ గ్రాంట్స్ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. కేవలం 2021-2022 సంవత్సరానికి మాత్రమే విడుదల చేసింది. అది కూడా అన్ని పాఠశాలలకు రాలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఈ రెండేళ్లలో పాఠశాలల్లో నిర్వహణ ఖర్చులు ఉపాధ్యాయులు తమ సొంత జేబునుంచి పెట్టుకున్నారు. ఇలా ప్రతి పాఠశాలలో వేలకు వేలు ఖర్చుచేసిన ఉపాధ్యాయులు అవి తిరిగి ఇస్తారన్న ఆశకూడా పెట్టుకోలేదు. అయితే రెండేళ్లపాటు ఒక్కపైసా కూడా ప్రభుత్వం స్కూల్ గ్రాంట్స్‌కు విడుదల చేయకపోయినా... గడచిన రెండేళ్లకు ఆడిట్ చేయించుకోవాలని ఆదేశాల్విడంతో ఉపాధ్యాయులు నివ్వెరపోతున్నారు. అసలు నిధులే రాకపోతే ఆడిట్ ఎలా చేయించుకోవాలని, దేనికి చేయించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఆడిట్ చేయించుకోవాల్సిందేనని చెప్పడంతో చేసేదిలేక ఖాళీ ఫైల్స్ తీసుకుని ఉపాధ్యాయులు వెళ్లి వచ్చారు. ఆడిట్‌లో మాత్రం నిధులు కర్చుచేసింది నిల్ అని రాయించుకుని వచ్చినట్లు సమాచారం. మరికొందరు హెచ్ఎంలు తాము రెండేళ్లుగా ఖర్చుచేసిన సొమ్మును వివరించి వచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి గ్రాంట్ వస్తే హెచ్ఎంలు ఖర్చుచేసిన సొమ్మును తిరిగి తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్రతి పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి గ్రాంట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి గ్రాంట్ విడుదల అవుతుంది. 100మంది విద్యార్థులు దాటిన పాఠశాలలకు రూ.50వేలకు పైబడి, 50మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.25వేలు, అంతకన్నా తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.12,500 ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రెండేళ్లుగా ఎలాంటి గ్రాంట్ రాలేదంటున్నారు. గ్రాంట్ రానప్పటికి ఖర్చులు మాత్రం చేతినుంచి పెడుతూ వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 మండలాల్లో ప్రాథమిక, జడ్పీ, ప్రాథమికోన్నత, మున్సిపల్ స్కూల్స్ కలిపి 2000 వరకు ఉన్నాయి. వీటన్నింటికి కలిపి కోట్లలో స్కూల్ గ్రాంట్ రావాల్సి ఉంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అయితే వందల కోట్ల గ్రాంట్ పెండింగ్‌లో ఉందని తెలుస్తోంది. విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చేది ఇలాగేనే అని పలువురు ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తున్నారు.

చేతి నుంచే ఖర్చులు


"పాఠశాలల్లో చాలా రకాల ఖర్చులు వస్తాయి. కరెంటు బిల్లులు మొదలుకుని రిపేర్స్, ఆగస్టు 15, బాలలదినోత్సవం, రిపబ్లిక్‌డే, సబ్బులు, కుళాయిలు, చాక్‌పీస్‌లు, డస్టర్లు ఇలా అనేక రకాలున్నాయి. వీటన్నింటికి సంవత్సరంలో వేలరూపాయలు అవసరం. ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా గ్రాంట్ రాలేదు. దీంతో మేమే సొంత నిధులు ఖర్చుచేసి నెట్టుకొస్తున్నాము" అని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అన్నింటికంటే కరెంటు బిల్లులు అధికంగా వస్తున్నాయంటున్నారు. గత నెలలో విద్యాశాఖామంత్రి విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చూసుకుంటుందని ప్రకటించారు. అయినా ఇప్పటి వరకు తాము చెల్లించిన బిల్లులు మాత్రం గ్రాంట్ వచ్చినప్పుడే తీసుకోవాల్సి ఉంటుందని అసలు గ్రాంట్ వస్తుందోరాదో తెలియని అయోమయ పరిస్థితి నెలొందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఆడిట్ జరుగుతోంది: ఎంఈవో

ఎర్రగుంట్ల మండలానికి చెందిన 50పాఠశాలలకు సంబంధించి ప్రొద్దుటూరులో ఆడిట్ జరుగుతోందని ఎంఈవో శివప్రసాద్ తెలిపారు. కొన్ని స్కూల్స్ వారు అనివార్య కారణాల వల్ల చేయించుకోలేదని వారికి మళ్లీ మరోచోట చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు.

ఎగ్జైట్ పోల్స్





దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు శనివారంతో ముగియనున్నాయి. పోలింగ్ ముగిసిన వెంటనే ఎగ్జిట్‌పోల్స్ రానున్నాయి. వీటి కోసం జిల్లా జనమంతా ఎగ్జైట్‌మెంట్‌తో ఎదురు చూస్తున్నారు. పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల కోసం కష్టపడ్డ కేడరు పోలింగ్ తరువాత ఇతర ప్రాంతాల్లో సేదదీరి ఇప్పటికే జిల్లాలోకి అడుగు పెట్టారు. 4న కౌంటింగ్ కోసం సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే మాదే గెలుపు అంటూ ధీమాలో ఉన్నారు. అయినా.. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు వచ్చే ఎగ్జిట్‌పోల్స్‌పై జనం సైతం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

- నేటి సాయంత్రమే విడుదల
- కాకిలెక్కలతో 18 రోజులుగా..
- ఫలితాల కోసం నిరీక్షణ
- ఇప్పటికే భారీగా పందాలు
- ఎగ్జిట్‌పోల్స్‌తో ఊపందుకోనున్న బెట్టింగ్



(కడప-ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. తొలిసారి అధికారంలోకి వచ్చిన వైసీపీ, గతంలో పలుమార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ, కాంగ్రెస్ ఈసారి ఎన్నికల బరిలో నిలిచాయి. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ అచేతన స్థాయికి చేరుకుంది. దివంగత సీఎం వైఎస్ ముద్దుల తనయ, సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిల కాంగ్రెస్ బాధ్యతలను చేపట్టడంతో పాటు కడప నుంచి పోటీ చేయడంతో ఒక్కసారిగా జిల్లాలో పొలిటికల్ సీనే మారిపోయింది.

జిల్లాలో 2004కు ముందు టీడీపీ ఆధిపత్యాన్ని చూపించేది. అప్పుడు ఉమ్మడి జిల్లాలో పెద్దసంఖ్యలో సీట్లు గెలుచుకునేది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయిన తరువాత జిల్లా రాజకీయ సరిస్థితులు మారిపోయాయి. వైఎస్ కుటుంబం గుప్పిట్లోకి వెళ్లాయి. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ నుంచి రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యారు. ఆయన మార్కు డెవలప్‌మెంటు జిల్లాపై చూపించారు. అందుకే ఆయన కొడుకు వైసీపీని స్థాపించినప్పుడు కాంగ్రెస్‌లోని చాలామంది జగన్‌వెంటే నడిచారు. 2011 ఉప ఎన్నికల్లో, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ప్రజలు జగన్‌కు జై కొట్టారు. ఈసారి పరిస్థితులు పూర్తిస్థాయిలో మారిపోయాయని అంటున్నారు. ఎందుకంటే జిల్లాలో ప్రతి ఎన్నికల్లోనూ వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్ జరిగేది. ఈసారి టీడీపీ కూటమి వస్తుందంటూ వన్‌సైడ్ బెట్టింగ్ సాగుతోంది. లక్షకు లక్షన్నర అంటున్నా వైసీపీ వైపు బెట్టింగ్ కట్టడానికి ఎవ్వరూ సాహసించడం లేదని అంటున్నారు.

ఈసారి జిల్లాలో రాజకీయ పరిస్థితులు మారిపోతాయంటున్నారు. 2019లో మాదిరి తామే మొత్తం స్థానాలు గెలుచుకుంటామని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తుండగా అంత సీన్ లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. టీడీపీకి జిల్లాలో మళ్లీ పూర్వ వైభవం వస్తుంది, 1999 నాటి ముందు పరిస్థితులు మొదలయ్యాయని, పులివెందుల తప్ప అన్ని స్థానాలు తామే గెలుస్తున్నామంటూ టీడీపీ చెప్పుకొస్తోంది. మే నెల 13న పోలింగ్ జరిగింది. అప్పటి నుంచి ఓటర్ల సరళి.. 2014, 2019లో జరిగిన ఓటింగ్ శాతం, ఈసారి వచ్చిన ఓట్లు.. అధికారపార్టీపై ఉన్న వ్యతిరేకత, ఓటింగ్ సరళి.. ఇలా రకరకాలుగా అంచనాలు వేసుకుని ఇన్నాళ్లు కాకిలెక్కలతో గెలుపోటములపై కాలక్షేపం చేశారు. అయితే కౌంటింగ్‌కు మూడురోజుల ముందు ఎగ్జిట్ పోల్స్ శనివారం వెలువడుతుండడంతో జిల్లావాసులంతా వాటి కోసం ఎంతగానో ఎదరుచూస్తున్నారు. ఎగ్జిట్‌పోల్స్ ద్వారా ఎన్నికల ఫలితాలు కొంత మేర నిజమవుతూ వచ్చాయి. అయితే ఈసారి జరిగిన ఎన్నికలు హోరాహోరీ సాగాయి. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందంటూ పేరున్న సర్వేసంస్థలు చేపట్టిన సర్వేలు చెప్పాయంటూ పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే వైసీపీ శ్రేణుల్లో మాత్రం మళ్లీ వైసీపీనే అంటూ కొన్ని సర్వే సంస్థల పేరుతో సోషల్ మీడియాలో ఇదిగో సర్వే అంటూ హడావుడి చేస్తున్నారు.

కడప ఎన్నికలు యమా క్రేజీ

జిల్లాలో ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలు యమా క్రేజీగా మారాయి. వైసీపీ చీఫ్‌గా సీఎం జగన్ ఉన్నారు. ఈసారి కాంగ్రెస్ చీఫ్‌గా జగన్ సోదరి షర్మిల బాధ్యతలు చేపట్టారు. కడప పార్లమెంటులో టీడీపీ నుంచి భూపేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిల, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్ పోటీ చేశారు. షర్మిల తన ఎన్నికల ప్రచారంలో మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య ప్రధానాస్త్రంగా వాడుకున్నారు. వివేకానందరెడ్డిని ఎంపీ అవినాశ్‌రెడ్డి చంపించారని హంతకులను సీఎం జగన్ కాపాడుతున్నారని న్యాయం కోసమే తాను బరిలో దిగినట్లు షర్మిల ప్రచార సభల్లో చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో వైఎస్ ఫ్యామిలీ రెండుగా చీలింది. సీఎం జగన్ ఆయన సతీమణి భారతి, ఎంపీ అవినాశ్‌రెడ్డి ఒక వైపు.. మరో వైపు వైఎస్ కుమార్తె, జగన్ చెల్లి షర్మిల, వైఎస్ భార్య విజయలక్ష్మి, వైఎస్ తమ్ముడు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, ఆయన కూతురు సునీత నిలబడ్డారు. దీంతో కడప పార్లమెంటులో ఎవరు గెలుస్తారనే దానిపై రెండు తెలుగురాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఇక పోలింగ్ తరువాత కడప పార్లమెంటులో షర్మిలాకు వచ్చే ఓట్లు, ఆమె గెలుపుపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది.

బెట్టింగ్ కోసం వెయిటింగ్

జగన్ వైసీపీ స్థాపించిన తరువాత జిల్లాలో ప్రతి ఎన్నికల్లో వైసీపీకి ఫేవరుగా బెట్టింగ్‌సాగేది. 2014, 2019లో ఇదే సాగింది. ఈసారి మాత్రం రివర్స్ బెట్టింగ్ సాగుతోంది. స్టేట్‌లో కూటమి అధికారంలోకి వస్తుంది, చంద్రబాబు సీఎం అవుతాడని బెట్టింగ్ జరపడం గమనార్హం. వైసీపీ నేతలే టీడీపీ వస్తుందంటూ బెట్టింగ్ కాయడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఇరుపార్టీల అభిమానులు మేం గెలుస్తాం, మేం గెలుస్తామంటూ భారీ సంఖ్యలో బెట్టింగ్ కాస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్‌తో ఎవరు అధికారంలోకి రానున్నారనే విషయంలో కొంత క్లారిటీ వచ్చినా.. 4వ తేదీ వరకు అసలు ఫలితాలకోసం ఎదురుచూడక తప్పదు. అయితే.. ఎగ్జిట్ పోల్స్‌తో బెట్టింగ్‌లు మరింత జోరందుకోనున్నాయని ప్రచారం సాగుతోంది.

భానుడు భగభగ

- ఉక్కబోతతో అల్లాడిన ప్రజలు





కడప (సెవెన్‌రోడ్స్), మే 31 : సూర్యుడు తన ప్రతాపాన్ని మళ్లీ చూపించాడు. కొద్దిరోజులుగా వాతావరణం చల్లబడినప్పటికీ మూడురోజుల నుంచి ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గురువారం జిల్లాలో అత్యధికంగా 42.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా.. శుక్రవారం సింహాద్రిపురం మండలంలో 43.7 డిగ్రీలు నమోదైంది. నేడు, రేపు కూడా ఇదే విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఉక్కబోత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. జిల్లాలో నాలుగు మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లోనూ 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో శుక్రవారం తొండూరులో 43.3 డిగ్రీలు, జమ్మలమడుగు 42.8, వల్లూరు 42.7, మైలవరం 42.4, ప్రొద్దుటూరు 42.3, కలసపాడు, పోరుమామిళ్లలో 42.2, కమలాపురం, ముద్దనూరులలో 42.1, బికోడూరులో 42, పెద్దముడియం 41.9, రాజుపాలెం 41.6, గోపవరం, మైదుకూరులలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే కడప, పెండ్లిమర్రి మండలాల్లో 41.2 డిగ్రీలు, ఖాజీపేట, చెన్నూరులలో 41.1, బద్వేలు 40.9, ఎర్రగుంట్ల 40.8, వీరపునాయునిపల్లె, అట్లూరు, సీకేదిన్నె, దువ్వూరులలో 40.7, చక్రాయపేట, కొండాపురంలలో 40.6, వేంపల్లె 40.5, సిద్దవటం, ఒంటిమిట్టలలో 40.1, చాపాడు 40, వేముల, వీఎన్‌పల్లె, లింగాల, కాశినాయనలలో 39.9, పులివెందులలో 39.7, బ్రహ్మంగారిమఠం మండలంలో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నయా పోలీసింగ్

- కౌంటింగ్ రోజున గొడవలు లేకుండా అలర్ట్
- 7వ తేదీ వరకు 21 మంది జిల్లా బహిష్కరణ
- 131 మంది గృహ నిర్బంధం


(కడప-ఆంధ్రజ్యోతి): నిన్నటిదాకా వైసీపీ పోలీసింగ్ అనే మాట వినబడేది. పోలీసులు ఐపీసీ యాక్టు కన్నా వైసీపీ యాక్టుకే ప్రాధాన్యం ఇచ్చేవారనే విమర్శ ఉంది. చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చూడకు.. అనేదానికి పూర్తి భిన్నంగా పోలీసులు వ్యవహరించేవారు. ఓ విధంగా చెప్పాలంటే వైసీపీకి తొత్తులుగా పనిచేశారు. వైసీపీ చెబితేనే కేసు కడతారనే విమర్శలున్నాయి.

అయితే ఎన్నికల కమిషన్ పుణ్యమా అని పోలీసుశాఖలో కదలిక వచ్చింది. కౌంటింగ్ రోజు తేడా చేస్తే తాట తీస్తామంటూ హెచ్చరించింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా కౌంటింగ్ రోజైన 4వ తేదీన జిల్లా వ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. కడపలోకి బస్సుల రాకపోకలు నిషేధించారు. 144 సెక్షన్ అమలుచేస్తున్నారు. గొడవలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో కౌంటింగ్ రోజున అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా ఉండేందుకు పలుచర్యలు తీసుకున్నారు. మే 13న జరిగిన ఎన్నికల్లో గొడవలకు దిగిన వారు, రాజకీయాల్లో కీకలంగా ఉన్నవారిపై దృష్టి పెట్టారు. కౌంటింగ్ అనంతరం జిల్లా ప్రశాంతంగా ఉండాలంటే పలువురిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గొడవలకు కారణమవుతున్నారని భావించిన రౌడీషీటర్లను జిల్లా బహిష్కరణ చేశారు. ఇక ఎన్నికల షెడ్యూలు విడుదల అయినప్పటి నుంచి 1033 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. కౌంటింగ్ రోజున గొడవలకు కారణమవుతారని భావించిన నేతలను హౌస్ అరెస్టు చేస్తే మేలని జిల్లాలో 131 మందిని గృహ నిర్బంధం చేయనున్నారు. వీరంతా శనివారం నుంచి 7వ తేదీ వరకు గృహ నిర్బంధంలో ఉంటారు. ఇక కడప, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల్లోని 21 మందిని జిల్లా బహిష్కరణ చేశారు. శనివారం నుంచి 7 వరకు జిల్లాలో ఉండకూడదంటూ ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి కౌంటింగ్‌రోజున ఘర్షణపడే అవకాశం ఉందంటూ ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో పోలీసులు అలర్ట్ అయి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాలకవర్గాన్ని విచారించిన సహకారశాఖ అధికారి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 31 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పాలకవర్గాన్ని శుక్రవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో డీసీఏవో సురేశ్‌కుమార్ విచారించారు. డీసీఎంఎస్‌లో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు, ఉన్నతాధికారులకు వెళ్లిన ఫిర్యాదు మేరకు కో-ఆపరేటివ్ యాక్టు సెక్షన్ 52 ప్రకారం విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పీఐసీ కమిటీ చైర్‌పర్సన్ చంద్రలీల, డైరెక్టర్లు శిరోమణి, సుదర్శనరెడ్డితో పాటు మరో డైరెక్టరును విచారించారు. ఇక్కడ జరిగిన అవకతవకలపై ముందస్తుగా ఏమైనా సమాచారం అందిందా, మీ దృష్టికి వచ్చిందా, అయితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు, అక్రమాల్లో ఏమైనా పాలకవర్గంలోని వ్యక్తుల ప్రమేయం ఉందా అన్న అంశాలపై విచారణ అధికారి సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రెండు మూడురోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు డీసీఏవో వివరించారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం



కడప (ఎర్రముక్కపల్లె), మే 31: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి శనివారం నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం అవుతాయని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం నుంచి జిల్లాలోని ప్రైవేటు, గవర్నమెంటు, సోషల్‌వెల్ఫేర్, ఆదర్శ కళాశాలలు తరగతులు ప్రారంభించాలని కోరారు.

వామ్మో జూన్..!

- పిల్లలకు పెట్టుబడులు పెట్టాల్సిందే
- భారీగా పెరిగిన ఫీజులు
- జూన్ అంటే హడలుతున్న తల్లిదండ్రులు
- ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

పాఠశాలలు మరో 12 రోజుల్లో పునఃప్రారంభం కానున్నాయి. దీనికి ముందే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జూన్ నెల అంటే చాలు.. వామ్మో అంటున్నారు. భారీగా పెరిగిన పాఠశాలల అడ్మిషన్ ఫీజులు, యూనిఫాం, పుస్తకాల ధరలతో ఆందోళన చెందుతున్నారు. ఇద్దరు ఎలిమెంటరీ స్కూలు పిల్లలు ఉండే తల్లిదండ్రులు ఎంత తక్కువ అనుకున్నా రూ.60వేల నుంచి రూ.70వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దీంతో సాధారణ, మధ్యతరగతి కుటుంబాల వారు జూన్ నెల అంటేనే హడలిపోతున్నారు.



బ్యాగులు కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



కడప (ఎడ్యుకేషన్), మే 31: జూన్ వచ్చిందంటే పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయి. వాటితో పాటు తల్లిదండ్రులకు ఆందోళన మొదలవుతుంది. భారీగా పెరిగిన ఫీజులు, చదువుకు అవసరమైన వస్తువుల ధరలతో ఈ గండం ఎలా గట్టెక్కుతుందని సాధారణ మధ్యతరగతి వాసులు హడలిపోతున్నారు. పిల్లల చదువు, కుటుంబ ఖర్చులతో అవస్థలు పడుతున్నారు. పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు మరింత క్రుంగదీస్తున్నాయి.

ఈ దఫా 40వేల కొత్త అడ్మిషన్లు

జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు విద్యాశాఖ లెక్కల ప్రకారం 774 ఉన్నాయి. గత ఏడాది ఈ పాఠశాలల్లో 1.82 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ఈ దఫా మరో 40వేల కొత్త అడ్మిషన్లు ఖాయంగా కనిపిస్తున్నాయి. ఈ లెక్కన 2.20 లక్షల మంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరంలో ప్రైవేటు విద్యను అభ్యసించనున్నట్లు అంచనా.

పెరిగిన ఫీజులు

స్కూళ్లను బట్టి నర్సరీ రూ.16వేల నుంచి రూ.20వేల దాకా ఫీజులు వసూలు చేస్తున్నారు. అలాగే ఎల్ కేజీ రూ.18వేల నుంచి రూ.22వేలు, యూకేజీ రూ.20వేల నుంచి రూ.25వేలు వసూలు చేస్తున్నారు. ఇక అడ్మిషన్ల ఫీజులు అయితే భారీగానే ఉన్నాయి. 7 నుంచి 10 తరగతులకు రూ.25వేల నుంచి రూ.50వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారు. స్కూలు బస్సుల ఫీజులు ఒక విద్యార్థికి నెలకు రూ.2వేల నుంచి రూ.3వేల పైమాటే. గత నెలరోజులుగా రంగంలోకి దిగిన పీఆర్వోలు ఫలానా స్కూలులో టెక్నో సిస్టమని, ఈరీడింగ్ అని లేనిపోని మాటలు చెప్పి తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటున్నారు. పలు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి 70 శాతం దాకా అడ్మిషన్లు ఇప్పటికే పూర్తయ్యాయి.

పాఠశాలలకు పండుగ సెలవులు

దసరా సెలవులు అక్టోబరు 2 నుంచి 14 వరకు 13 రోజులు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే క్రిస్మస్ సెలవులు మిషనరీ స్కూళ్లకు డిసెంబరు 23 నుంచి 25 వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు ఉంటాయి.

ఆకాశాన్నంటుతున్న ధరలు

ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. ధరలు కూడా భారీగానే ఉన్నాయి. స్కూలు బ్యాగులు రూ.800 నుంచి రూ.1500 అలాగే షూస్ రూ.500 నుంచి వెయ్యి వరకు ఉన్నాయి. ఎల్‌కేజీ నుంచి యూకేజీ పిల్లల పుస్తకాలకు రూ.5వేలు, యూనిఫాం మరో రూ.2వేలు, నోటు పుస్తకాలకు రూ.3వేలు పెన్నులు, పెన్సిళ్లు, రబ్బరు ఇతరత్రాలకు మరో రూ.500 పెట్టాల్సిందే.

12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

జిల్లాలో 2024-05 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని ప్రభుత్వం వెల్లడించింది. జూన్ 1 నుంచి బడి బాట కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రకటించింది. ఈ కార్యక్రమం 11వ తేదీ వరకు కొనసాగనుంది. అలాగే జూన్ 1 నుంచి మొత్తం 229 పనిదినాలు ఉంటాయని ప్రకటన వెలువరించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 23 పాఠశాలలకు చివరి పనిదినమని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ కేలండరును విడుదల చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయని ప్రకటించారు.

పరీక్షల వివరాలు

అకడమిక్ క్యాలెండరులో భాగంగా జూన్ 1 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. జూన్ 12 నుంచి బడులు పునఃప్రారంభం, జులై 31 నుంచి ఎఫ్ఏ1 పరీక్షలు, సెప్టెంబరు 30 నాటికి ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తారు. అక్టోబరు 21 నుంచి 28 వరకు ఎస్ఏ1 పరీక్షలు, డిసెంబరు 17 నాటికి ఎఫ్ఏ3 పరీక్షలు, జనవరి 29 నాటికి పది విద్యార్థులకు ఎఫ్ఏ4 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28 నాటికి 1నుంచి 9వరగతి విద్యార్థులకు ఎఫ్ఏ4 పరీక్షలు, ఏప్రిల్ 9 నుంచి 19 వరకు ఎస్ఏ2 పరీక్షలు, ఫిబ్రవరి 29కి ముందే టెన్త్ ప్రీఫైనల్, మార్చిలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలలకు చివరి పని దినం ఏప్రిల్ 23. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు.



వెటర్నరీవర్శిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొఫెసర్ శ్రీలత

తిరుపతి రూరల్, మే 31: తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్శిటీ తాత్కాలిక డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొద్దుటూరులోని వెటర్నరీసైన్స్ కళాశాల పాథాలజీ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలతని నియమిస్తూ వర్శిటీ వీసీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు డీఆర్‌గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో.. శ్రీలతని తాత్కాలిక డీఆర్‌గా నియమించారు. దాంతో శ్రీలత ఆ బాధ్యత చేపట్టారు. కాగా ప్రభుత్వం పెంచిన 65 సంవత్సరాల సర్వీసుకు హైకోర్టు ఇంటీరియమ్ ఆర్డర్‌తో సర్జన్‌రావుని ప్రొఫెసర్‌గా కొనసాగిస్తూ వర్శిటీ రిజిస్ట్రార్ అరుణాచలం రవి ఉత్తర్వులు వెలువరించారు. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ప్రొఫెసర్ శ్రీలత నియామకంపై ఏపీ ఎన్నికల కమిషన్ అధికారి(సీఈవో) అనుమతి తీసుకున్నారా అన్న అంశంపై రిజిస్ట్రార్‌ని వివరణ కోరగా.. 6నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని, వర్శిటీ పాలకమండలిలో పెట్టి రాటిఫికేషన్ తీసుకుంటామని వివరించారు.

ఆర్‌అండ్‌బీలో నరసింహారెడ్డి సేవలు మరువలేనివి



పదవీ విరమణ చేసిన ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఈ మహేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు,మే 31 : ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ శాఖలో ఈఈగా పనిచేసిన నరసింహారెడ్డి సేవలు మరువలేనివని ఆశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేశ్వరరెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక ఎస్‌కేవీ ఫంక్షన్ హాలులో ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డి పదవీ విరమణ సభ ఘనంగా జరిగింది. ఈసభలో నరసింహారెడ్డిని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 36 ఏళ్లుగా నరసింహారెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖలో సేవలందించారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఇరిగేషన్ ఎస్ఈ సీపీ రెడ్డిశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్ఈలు వెంకటరామిరెడ్డి, జయరామిరెడ్డి, పుల్లయ్య, రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మాధవి, కడప ఈఈ ప్రభాకర్‌నాయుడు, రాజంపేట ఈఈ సహదేవరెడ్డి, పులివెందుల ఈఈ సిద్ధారెడ్డి, ఈఈ భాస్కర్‌రెడ్డి, నంద్యాల డీఆర్ఈవో శ్రీధర్‌రెడ్డి, ఏపీ ఐసీసీ జోనల్‌మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఈఈ లక్ష్మీనరసింహులు, ఎన్ కంభగిరి, ఏఈ రామక్రిష్ణారెడ్డి, సునీల్ కుమార్, బాషా, అభిలాష్‌రెడ్డి, రజియా, గిరి ఆర్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు

నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

సీకేదిన్నె, మే 31: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికిగాను అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని వ్యవసాయ పరిశోధన కేంద్రం ఊటుకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసాచారి తెలిపారు. రాష్ట్రంలోనూ వివిధ జిల్లాల్లో ఉన్న 17 ప్రభుత్వ, 58 అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం రెండు సంవత్సరాల కోర్సు నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ పార్మింగ్, వ్యవసాయ ఇంజనీరింగ్‌కు సంబంధించిన డిప్లమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ శనివారం నుంచి ప్రారంభమవుతుందని చివరితేదీ జూన్ 20 తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9000523420 నంబరును సంప్రదించాలన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం.. కేసు నమోదు



లక్కిరెడ్డిపల్లె, మే 31: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా గరుగపల్లె ఏరు నుంచి నూలివీడుకు 18 టన్నుల ఇసుకను తరలిస్తుండగా టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని గాలివీడు పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నాగరాజు, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

60 మంది గృహ నిర్బంధం..

ఇద్దరు జిల్లా బహిష్కరణ

రాజంపేట టౌన్, మే 31 : రాజంపేట డివిజన్ పరిధిలో 62 మందికి పైగా హౌస్ అరెస్టు, ఇద్దరిని జిల్లా నుంచి బహిష్కరించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఎన్నికల అనంతరం అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో గుర్తించిన వ్యక్తులకు ఇప్పటికే నోటీసులను జారీ చేసినట్లు తెలుస్తోంది. దాసరి పెంచలయ్య, రాజారెడ్డి అనే వ్యక్తులను జిల్లా నుంచి బహిష్కరించగా, 60 మందిఇ పైగా పలు పార్టీల నేతలు, కార్యకర్తలను గృహ నిర్బంధం చేసినట్లు తెలిపారు. నోటీసులు స్వీకరించినవారు 4, 5వ తేదీల్లో ఎలాంటి ఘటనల్లో పాలు పంచుకోరాదని హెచ్చరించారు. పోలీసుల సూచనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చైతన్య తెలిపారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైనందుకు

హెచ్‌ఎంకు రెండు ఇంక్రిమెంట్లు కట్

కడప (ఎడ్యుకేషన్), మే 31 :ఎన్నికల విధులకు గైర్హాజరైన కారణంగా వేంపల్లె జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసినట్లు ఆర్జేడీ వై. రాఘవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమె ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సీసీ అండ్ ఏ రూల్ ప్రకారం చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

కరువు కాటేసింది

- నిట్టనిలువునా ఎండిపోతున్న మామిడి తోటలు
- చెట్లను బతికించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్న రైతులు
- వరుణుడి కోసం ఎదురుచూపులు
- ట్యాంక్ రూ.700 అయినా నీళ్లు దొరకని వైనం



ఉన్న బోరు ఎండిపోవడంతో మరో బోరు వేస్తున్న దృశ్యం



నీళ్లు లేక ఎండిపోయిన మామిడిచెట్లు

లక్కిరెడ్డిపల్లె, మే 31: వర్షాలు సక్రమంగా కురవక కరువు కాటేయడంతో రైతులు అల్లాడిపోతున్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం అసలే మిట్ట ప్రాంతం. వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి. ఈ ప్రాంతానికి ఎలాంటి ప్రాజెక్టులు, నదులూ లేవు. వర్షం ఆధారంగానే పంటలు సాగు చేయాలి. సకాలంలో వర్షాలు కురవక పోతే ఆ ఏడాది పంటలు నేలపాలే. ఈ ప్రాంతంలో వేరుశనగ ప్రదానమైన పంట. ప్రతి ఏటా వేరుశనగ సాగుచేయడం.. అతివృష్టి లేదా అనావృష్టితో చేతికందే సమయంలో పంట నేలపాలై చివరికి అప్పులే మిగిలేవి. దీంతో చాలామంది రైతులు రెండు దశాబ్దాలుగా క్రమంగా మామిడి సాగువైపు దృష్టి మరలించారు. ప్రస్తుతం లక్కిరెడ్డిపల్లె మండలంలో మామిడితోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి. అయితే.. ఈ ఏడాది వర్షాలు కురవక బోరుబావులు ఎండిపోయాయి. 20 నుంచి 30 సంవత్సరాల వయసున్న మామిడి చెట్లు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

జనవరి నెలలో బోర్లల్లో అరకొర వచ్చిన నీటితో మార్చి నెల వరకు చెట్లను బతికించుకున్నారు. తీరా పూత పిందెతో ఉన్న సమయంలో నీరు లేకపోవడంతో మామిడిచెట్లు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. కొంతమంది రైతులు మామిడి చెట్లను బతికించుకోవడానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కొత్తబోర్లు వేస్తున్నారు. మరి కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ట్యాంకర్లతో నీటిని తోలాలన్నా మండలంలో ఎక్కడా నీరు లభ్యం కావడం లేదు. దీంతో పొరుగు మండలాల నుంచి ట్యాంకర్ రూ.700 నుంచి రూ.1000 ఖర్చుతో తోలించి చెట్లను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా 20 నుంచి 30 సంవత్సరాల చెట్లకు నీరు చాలక ఎండిపోతున్నాయి.

మండలంలో 15 ఎకరాలకుపైగా మామిడితోటలు ఉన్న పెద్దకారు రైతులు ప్రతి ఏటా మంచి దిగుబడులు తీసేవారు. ఈ ఏడాది ఆదాయం దేవుడెరుగు చెట్లను బతికించుకుంటే చాలన్నట్లుగా అష్టకష్టాలు పడుతున్నారు. ఎక్కువగా బి.ఎర్రగుడి పంచాయతీలోని కాపుపల్లె, పాళెంగొల్లపల్లె, మామిడిగారిపల్లె, కోనంపేట, దప్పేపల్లె పంచాయతీల్లో మామిడితోటలపై ఆధారపడి చాలామంది రైతులు జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది నీరులేక చెట్లలో పూత పిందె నిలవక దిగుబడులు రాలేదు. దీనికితోడు చెట్లను బతికించుకోవడానికి లక్షల రూపాయలు ఖర్చులు పెడుతున్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినా ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

రెండెకరాల్లో మామిడి చెట్లు ఎండిపోయాయి..



ఏటా వేరుశనగ పంట సాగుచేసి పూర్తి స్థాయిలో నష్టపోయాను. దీంతో 15 సంవత్సరాల నుంచి 15 ఎకరాల్లో మామిడితోటలు సాగుచేశాను. పంట దిగుబడి బాగా వస్తే ఏటా రూ.20 నుంచి రూ.30లక్షలు లాభాలు వచ్చేవి. ఈ ఏడాది వర్షాలు లేక 10 బోర్లల్లో నీళ్ల ఆగిపోయాయి. దీంతో 2 ఎకరాల్లో మామిడి చెట్లు ఎండిపోయాయి. ఇప్పటి వరకు నీళ్ల తోలేందుకు ట్యాంకర్లకు రూ.3లక్షలు ఖర్చు పెట్టినా. ప్రభుత్వం ఆదుకోవాలి.

- బండ్రేరెడ్డి శంకర్‌రెడ్డి, రైతు, బి.ఎర్రగుడి

అప్పులు చేసి చెట్లను బతికించుకుంటున్నా..



30 సంవత్సరాల చెట్లు నీరు లేక నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. చెట్లను వదులుకోలేక అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి మామిడిచెట్లను కాపాడుకుంటున్నా. అయినా కొన్ని మామిడి చెట్లు ఎండిపోయాయి. లక్షల రూపాయలు అప్పులు చేసి బోర్లు వేశాను. నీరు పడలేదు. ప్రభుత్వం ఏ రూపంలోనూ మాకు సహాయం చేయలేదు.

- రాజశేఖర్‌రెడ్డి, రైతు, కాపుపల్లె



ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీరు పడుతున్న రైతు రాజశేఖర్‌రెడ్డి

ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

- రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి



రాయచోటి(కలెక్టరేట్), మే31: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూజర్‌వైజర్ల పాత్ర కీలకమని రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఓట్ల లెక్కింపుపై రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని అంశాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కౌంటింగ్ నిర్వహించాల్సి ఉంటుందని, ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోరాదన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది అందరూ జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటలకు శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకోవాల్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య వచ్చిన వెంటనే ఆర్‌వోకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు డీపీవో ధనలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపై డీజిల్ పోసుకుని

వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 31: జమ్మలమడుగు మండలంలోని గండికోట కొట్టాలపల్లెలో గురువారం మైల మహేంద్రయాదవ్ (33) అనే వ్యక్తి ఇంట్లో ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు మైల మహేంద్రయాదవ్ 2019 నుంచి గండికోట కొట్టాలపల్లె గ్రామంలో నివాసం ఉన్నాడు. ఈయన స్థానిక గాలిమరల వద్ద ఉద్యోగం చేసుకుంటూ వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య వరలక్ష్మి, కుమారుడు చైతన్య, కూతురు రోహిత ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం కుమారుడు చైతన్య అనారోగ్యంతో మృతిచెందాడు. కొడుకు చనిపోయాడని బెంగపెట్టుకుని అప్పటి నుంచి బాధపడుతూ ఉండేవాడు. కొడుకుపై బెంగతో ఇంటికి డీజిల్ తెచ్చుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మైల మహేంద్రయాదవ్ జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కాగా జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు.

ఏపీ ఈసెట్‌లో

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి ప్రతిభ

సింహాద్రిపురం, మే 31: సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తృతీయ సంవత్సరం ఈఈఈ విద్యార్థి దావూద్ హుస్సేన్ 2024 ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 105 ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిమ కనబరచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. దీంతో ఈఈఈ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శివశంకర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. దావూద్ హుస్సేన్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

అనంతపురం, నెల్లూరు జట్ల ముందంజ



అత్యధిక పరుగులు సాధించిన అర్జున్ టెండూల్కర్ (61), వంశీకృష్ణ (100), ఫర్హద్ ఖాద్రి (102)

కడప (కల్చరల్), మే 31: కడప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ మెన్ ఒన్ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం చిత్తూరు- అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 143 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 47.4 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి 249 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అర్జున్ టెండూల్కర్ 61 పరుగులు చేయగా మరో బ్యాటర్ బి. వినయ్‌కుమార్ 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 32.3 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి కేవలం 146 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి చవిచూసింది. ఇందులో ధరణికుమార్ నాయుడు మాత్రమే 26 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు 143 పరుగుల తేడాతో విజయం సాధించింది.

8 వికెట్ల తేడాతో నెల్లూరు విజయం

కడప కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో శుక్రవారం కడప-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో క్రికెట్ మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 46.1 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో వంశీకృష్ణ (బ్యాటర్) సరిగా 100 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు 36.5 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 230 పరుగులు సాధించింది. ఇందులో ఫర్హద్ ఖాద్రి (బ్యాటర్) 102 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నెల్లూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



గూడెంచెరువు మలుపు వద్ద గ్రావెల్ లోడుతో వెళుతున్న టిప్పర్



పెన్నానది వంతెనపై గ్రావెల్‌తో తరలిపోతున్న టిప్పర్



గూడెం చెరువు మలుపు వద్ద సుద్దరాయి, మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

జమ్మలమడుగు, మే 31: జమ్మలమడుగులో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయిదు సంవత్సరాల నుంచి జమ్మలమడుగు పరిసర ప్రాంతాలు, గండికోట దారి, పెన్నానదిలో మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నా అధికార పార్టీ భయంతో అధికారులు సైతం నోరు విప్పలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు అధికారుల అండతో అక్రమ రవాణాలో జోరు పెంచారని విమర్శలున్నాయి. అందులో భాగంగా జమ్మలమడుగు మండలం గూడెంచెరువులో గూడాదేవి చెరువు వద్ద నుంచి ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్లకు మట్టి నింపుకుని పెద్ద ఎత్తున తరలించేస్తున్నారు. అలాగే గండికోట వెళ్లే దారి నుంచి టిప్పర్లలో సుద్దమట్టి, గ్రావెల్, జోరుగా తరలిస్తున్నారు. సమీప గ్రామాలకు చెందిన రెవెన్యూ సిబ్బందికి ఈ విషయం తెలిసినప్పటికి ఏ ఒక్కరికీ అడిగే ధైర్యం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గండికోట దారి నుంచి గూడెం చెరువు మీదుగా జమ్మలమడుగు పట్టణం పెన్నానది వంతెనపై అతివేగంతో ట్రాక్టర్లు, టిప్పర్లు మట్టి తరలిస్తున్నా ఒక్క అధికారి కూడా ప్రశ్నించకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంత యథేచ్ఛగా పట్టపగలే మట్టి తరలిస్తున్నా చెక్‌పెట్టేవారే కరువయ్యారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం ఉదయం గూడెం చెరువు పాఠశాల వద్ద మలుపులో ద్విచక్ర వాహనం, టిప్పర్లు, ట్రాక్టర్ల మధ్య ప్రమాదం జరిగేదని అంటున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు అతివేగంగా రావడంపై కొందరు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది.

కొండపేట చెరువంతా గుంతలే

● అక్రమార్కులకు ఆదాయ మార్గం ● రాత్రివేళ ఇష్టానుసారంగా మట్టి తరలింపు


గుంతలమయమైన కొండపేట చెరువు

చెన్నూరు, మే 31 : మండలంలో 500 ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్ద చెరువు అది. రైతుల పాలిట ఈ చెరువు వరం. అది కొన్నేళ్లుగా అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. దీంతో చెరువు నిండా ఎక్కడ చూసినా గుంతలే. ఆ గుంతలు కూడా నాలుగు అడుగుల నుంచి ఏడు అడుగుల వరకు ఉన్నాయి. చెరువును చూసిన రైతులు లబోదిబోమంటు చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలించకుండా ఆపమని వేడుకుంటున్నా వారి ఆవేదనను పట్టించుకునే వారు కరువయ్యారు. ఇది మండలంలోనికొండపేట చెరువు దుస్థితి. కొండపేట చెరువు బ్రిటీష కాలం నుంచి అగ్రిమెంటు చెరువుగా ఉంది. కేసీ కెనాల్‌కు నీరు వస్తే ఈ చెరువును మొదట ఖచ్చితంగా నింపాల్సిందే. 90 ఎకరాలకు పైన విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు కింద 500 ఎకరాలు ఆయకట్టు సాగులో ఉంది. అయితే కొన్నేళ్లుగా ఈ చెరువును అక్రమార్కులు ఆదాయ మా ర్గంగా ఎంచుకున్నారు. పూర్వపు రోజుల్లో ఒక చెరువును తవ్వాలంటే కొన్ని వందల మంది కూలీలు నెలలు లేదా సంవత్సరాల పాటు పనిచేసి గుంతలు తవ్వి అడుగు భాగంలో వండ్రు బంక మట్టి చేర్చి ఆపై గ్రావెల్‌ను రోలర్లు (బండగుళ్లు) ఎద్దులతో తిప్పి తయారు చేసేవారు. అప్ప ట్లో పెద్దలు కట్టిన చెరువులు ఇప్పుడు అక్రమార్కులకు ఆదాయ మార్గాంగా మారాయి. సుమారు 10 అడుగులకు పైగా గ్రావెల్ నింపగా ప్రస్తుతం చెరువులో నాలుగు అడుగుల నుంచి ఏడు అడుగుల వరకు గ్రావెల్ తరలించారు. ఈ గ్రావెల్ చెన్నూరుతో పాటు చుట్టుపక్కల గ్రామ పంచాయతీలో రాత్రివేళ ఎక్సకవేటర్లు ఏర్పాటు చేసి ట్రాక్టరులో తరలిస్తున్నారు. ఈ విషయాన్ని అటు ఆయకట్టుకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులకు తెలిపితే వారు వచ్చి తనిఖీలు చేసినప్పుడు ట్రాక్టర్లు పరారవుతుంటాయి. ఏమాత్రం కనిపించవు. చీకటి పడితే మాత్రం యదావిధిగా తమ పనులు సాగించుకుంటున్నారు. పదేళ్ల క్రితం చెరువులో కనిపించని గుంతలు ఈ పదేళ్ల కాలంలో దాదాపు 50 వరకు ఏర్పడ్డా యి. చెరువుకట్టపై నుంచి చూస్తే చెరువు బదులు మొత్తం గుంతలే కనువిందు చేస్తుంటాయి. ఈ గుంతలు ఆ చెరువు కింద సాగు లో ఆయకట్టు ఉన్న రైతులంతా చెరువును చూసినడప్పుడల్లా తల్లడిల్లుతున్నారు. వ్యవసాయం కోసం చెరువులు నిర్మిస్తే ఇదే కొండపేట గ్రామంలోని కొందరు ఇష్టానుసారంగా అక్రమ మార్గంలో గ్రావెల్ మొత్తం తరలించి గుంతలు పెట్టి సాగుకు ఉపయోగపడకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా చెరువు లోపలి భాగమంతా చదునుగా, సమానంగా ఉంటే ఆ చెరువు కింద పొలాలకు నీరు సాఫీగా పారుతుంది. కానీ కొండపేటచెరువు ఆ ప రిస్థితిలో లేదు. అధికారులు నిత్యం చెరువును తనిఖీ చేసి సంరక్షించకపోతే భవిష్యత్తులో రైతులకు బతుకుదెరువు లేకుండాపోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చెరువుపై అధికారులు దృష్టిసారిస్తే కదా!



రైతులకు ఉపయోగపడే చెరువును స్థానికులే ఇష్టానుసారంగా గుంతలు పెడుతుంటే అధికారులు నిద్రపోతున్నారా..? ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అలా వచ్చి ఇలా వెళతారు తప్ప పూర్తిగా కట్టడి చేయడంలేదు. నీటిపారుదల శాఖ పరిధిలోకి వచ్చే ఈ చెరువు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కనీసం మూడు నాలుగు రోజులకు ఒకసారి అయినా తనిఖీ చేయాలి. మండలంలో ఉన్న ఏకైక పెద్దచెరువు ఇదే. ఇంత పెద్ద చెరువులో ఇంతకాలం గ్రావెల్ తరలిస్తుంటే వారు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. వారు నిమ్మకునీరెత్తినట్లు ఉండటంతో రైతులు కూడా వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించకపోతే చెరువు అంతా అక్రమార్కులపరం అవు తుందనడంలో సందేహంలేదు. అధికారులు విచారణ జరిపితే గ్రావెల్ దొంగలు ఖచ్చితంగా బయ టపడతారు. పోలీసులకు ఉన్నతాధికారులకు తక్షణం ఫిర్యాదు చేసి చెరువును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- ఉండేల బాలక్రిష్ణారెడ్డి,
రైతు, కొండపేట, చెన్నూరు మండలం

ఒక యూనివర్సిటీలో రెండు విద్యా సంస్థలు

● ఇది వైవీయూ అధికారులకే చెల్లు ● ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి ● ఏఐఎస్ఎఫ్ డిమాండ్


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు

కడప (ఎడ్యుకేషన్), మే 31 :ఒక యూనివర్సిటీలో రెండు విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం వైవీయూ అధికారులకే చెల్లిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు తెలిపారు. వైవీయూ వీసీ, రిజిస్ట్రారు కలిసి తీసుకున్న ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైవీయూకు సంబంధించిన భవనాలను ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి కేటాయించడం సరికాదన్నారు. వైవీయూ కేంద్రమంటే అక్కడ విద్యార్థులు, పాలక మండలి, అధ్యాపకుల సముదాయం కమిటీ ఉంటుందని తెలిపారు. కేవలం స్వామిభక్తిని ప్రదర్శించం కోసమే వైవీయూను ఆర్కిటెక్చర్ అండ్‌ఫైనాన్స్ యూనివర్సిటీకి కేటాయిస్తే సహించేదిలేదన్నారు. వైవీయులో కొత్త కోర్సులు అమలు చేయాలని, ఇప్పటికే ఉన్న కోర్సులకు పూర్తిస్థాయిలో భవనాలు అందించాల్సి ఉండగా ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి ఏ విధంగా భవనాలు అందిస్తారన్నారు. తక్షణం ఈ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని, లేకుంటే వైవీయూలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్‌తేజ, శివ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి మహోత్సవాలు


గండి క్షేత్రంలో పూజలు నిర్వమిస్తున్న వేదపండితులు

చక్రాయపేట, మే 31: ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో హనుజ్జయంతి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మూడవ రోజు త్రికాల ఆరాధన, చతుస్తానార్చన, మన్యు సూక్త హోమం, మూలమంత్ర హోమం, స్నపన తిరుమంజనం, లఘుపూర్ణాహుతి, గోష్టి, భక్తులకు తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి దంపతులు హోమ పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కావలి కృష్ణతేజ, వేదపారాయణదార్ రామమోహన్‌శర్మ, ముఖ్య అర్చక గోపాలస్వామి పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వ్రతం

కడప (కల్చరల్), మే 31: హనుమద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 1వ తేదీ నగర గడ్డిబజార్‌లోని కామకోటి కళాంబ సమేత సోమేశ్వరేశ్వర స్వామి (బాలాజీ) దేవస్థానంలో వెలసిన ఆంజనేయస్వామికి ఉద యం 8 గంటలకు పంచామృత అభిషేకం, హనుమద్ వ్రతం నిర్వహించ నున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ తెలిపారు. అందులో భాగంగా గణపతి పూజ, విశేష అలంకారం, వడమాల, నాగవల్లీ దళార్చన, సింధూరార్చన, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పాస్టర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి సునీల్‌దత్

కమలాపురం రూరల్, మే 31 : పాస్టర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుదాస్, సునీల్‌దత్ తెలిపారు. శుక్రవారం పాలెం ప్రార్థనా మందిరంలో కమలాపురం పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, కార్యదర్శి సునీల్‌దత్ మాట్లాడుతూ పాస్టర్ల సమస్యల పరిష్కారం కోసం పో రాటం చేస్తామన్నారు. వివిధ చర్చిలకు సంబంధించి శ్మశా న స్థలాలు లేవని, అన్ని చర్చిలకు శ్మశాన స్థలాలు ఏర్పాటు చేసేలా అధికారులతో మాట్లాడి కృషి చేస్తామన్నారు.

నూతన కమిటీ

ప్రెసిడెంట్‌గా ప్రభుదాస్, వైస్ ప్రెసిడెంటుగా హెప్సిబా క్రిష్టియానా, సెక్రటరీగా సునీల్‌దత్, జాయింట్ సెక్రటరీ స్టీఫెన్, ట్రెజరర్‌గా రాజకుమార్, ఈసీ మెంబరుగా రాజు జాషువాలను ఎన్నుకున్నామని వారు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా పాల్‌కుమార్, గౌరవ సలహాదారుగా సురేష్ బాబులను ఎన్నుకున్నామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. న్నారు. కాగా నూతన కమిటీ నియామకానికి ముందుగా పాస్టర్స్ అందరూ ప్రార్థన చేశారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులు, సహాయకులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారులు లిల్లెమ్మ, విజయారెడ్డి

వల్లూరు, మే 31 : మండలంలోని 46 పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు, సహాయకులకు వల్లూరులోని ఏపీ మోడల్ స్కూలులో శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లిల్లెమ్మ, పి.విజయారెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు వంట తయారు చేసేటప్పుడు శుభ్రంగా ఉం డాలని, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిం చారు.

అలాగే నాణ్యమైన భోజనం తయారు చేయాలని సూచించారు. బియ్యం, కూరగాయలను బాగా శుభ్రం చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు శివకుమార్, షేక్ రిహానా వారం మొత్తం మెనూను వీడియోల ద్వారా వివరించారు. అనంతరం వంట ఏజెన్సీ నిర్వాహకులు, సహాయకులకు వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. వంట తయారీలో మొదటి బహుమతి వెంకటాపురం పాఠశాలకు చెందిన శ్రీలత, రెండో బహుమతి వల్లూరు మెయిన్ పాఠశాలకు చెందిన లక్ష్మీదేవికి, మూడో బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగాయపల్లెకు చెందిన దిల్షాద్‌కు అందించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్.శివకుమార్‌రాజు, శివశంకర్, ఎమ్మార్పీ, సిబ్బంది, వంట ఏజన్సీ నిర్వాహకులు సహాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగ పిల్లల నమోదు కార్యక్రమం


చెన్నూరులో దివ్యాంగ పిల్లలతో ఎంఈఓ

చెన్నూరు, మే 31 :మండల వ్యాప్తంగా దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు జూన్ 9 వరకు నమోదు ప్రక్రియ జరుగుతుందని ఎంఈఓ గంగిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మండలంలోని భవిత కేంద్రం ఉపాధ్యాయులతో చెన్నూరులో దివ్యాంగ పిల్లలను గుర్తించారు. ఇళ్ల వద్దకు వెళ్లి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. దివ్యాంగ పిల్లలకు ప్రతి బుధవారం ఫిజియోథెరపి వైద్యం అందిస్తారన్నారు. కావున తల్లిదండ్రులు ఇలాంటి దివ్యాంగ పిల్లలను ప్రభుత్వం నిర్వహించే భవిత కేంద్రంలో చేర్పించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు శ్రీదేవి, కళావతి దివ్యాంగ పిల్లలను చేర్చుకుంటారన్నారు.

వికసించిన మే పుష్పాలు



రైల్వేకోడూరు, మే 31: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తంబిళ్లవారిపల్లెకు చెందిన పంజం విజయరంగారెడ్డి ఇంటి ఆవరణలో శుక్రవారం మే పుష్పాలు వికసించాయి. లిల్లీ జాతికి చెందిన ఈ మొక్కలు ప్రతి ఏడాది మే నెల లోనే వికసిస్తాయి. ఈ మొక్కను నేలలో ఒక సారి నాటితే చనిపోవడం ఉండ దు. నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుంది.

'విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు'

నందలూరు, మే 31 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈనెల 4న వెలువడనున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టపాసులు పేల్చినా, ర్యాలీలు ని ర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితాల రోజున రాజ కీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని తెలిపారు. 30 యాక్టు, 144 సెక్షన్ అమల్లో వుంటుందని తెలిపారు. ఎటువంటి అల్లర్లకు పాల్ప డకుండా సహక రించాలని కోరారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్‌లు పరమేష్, గోపాల్, సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత హస్త కళా ప్రదర్శనకు విశేష స్పందన


వస్త్ర ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న ప్రజలు

కడప (ఎర్ర ముక్కపల్లె), మే 31 : కడప నగరం సేక్‌నామ్‌కాన్ కళాక్షేత్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళల ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. ఈ మేళాలో ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కళంకారీ, ఉప్పాడ వంటి చీరలతో పాటు అస్సాం, బాగల్పుర శిల్క్, తప్సార్ ట్రిపుల్ వర్క్స్ పోసా సిల్క్స్, మాండని, తచ్చా ఎంబ్రాయిడరీ, శారీలు ఎంబ్రాయిడరీ చీరలు, డ్రెస్ మెటీరియల్, ప్రింటెడ్ చీరలు, మహేశ్వరి చీరలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు సంజయ్‌జైన్ తెలిపారు. అదే విధంగా లక్నో, హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్ డోరు కర్టెన్స్ జైపూర్ స్టోన్ జ్యువెలరీ పెరల్స్, ఉడెన్ హ్యాండిక్రాఫ్ట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకు అందుబాటులో ఉంటుందని ఈ ఎగ్జిబిషన్ ఏడురోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని కడప నగర ప్రజలు సద్వినియోగంచే సుకోవాలని కోరారు.

అందరివాడు కుప్పాల శ్రీనివాసులు


శ్రీనివాసులును సత్కరిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

కడప (ఎర్రముక్కపల్లె), మే 31 :కడప నగరం ఐఎంఏ హాలులో శుక్రవారం సాయంత్రం జరిగిన కుప్పాల శ్రీనివాసులు రికార్డ్ అసిస్టెంట్, జిల్లా కేంద్ర గ్రంథాలయం, కడప ఉద్యోగ విరమణ కార్యక్రమంలో సెక్రటరీ అమీరుద్దీన్ మాట్లాడుతూ అందరికీ తలలో నాలుకలాంటివాడు, అందరికి సహాయ సహకారాలందించి ఎలాంటి విసుగు, విరామం లేకుండా అందరికీ సహకరిస్తూ తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించిన మనసున్న వ్యక్తి అని కొనియాడారు. ప్రకాష్, బాబ్జీ, కిషోర్, పవన్, నాగముని, ఇబ్రహీం, సుబ్రహ్మణ్యం, హరి, శేఖర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నవాబ్‌జాన్, సుబ్బమ్మ, రాజ్ కుమార్, శ్రీనివాస ఆచారి, మ నోహర్ రమణ, సురేష్, సుబ్బరాజు, కుటుంబ సభ్యులు కుమారుడు రాజేష్‌కుమార్, కుమార్తెలు డాక్టర్ దీపికరాణి, ప్రత్యూష, అల్లుడు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), మే 31 :ప్రమాదానికి గురై చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికకు లయన్స్ క్లబ్ సభ్యులు సాయం అందించారు. గంగిరెడ్డిపల్లెకు చెందిన వెన్నెల తీవ్రంగా గాయపడి చికిత్స కోసం ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం స్థానికులు లయన్స్‌క్లబ్ ప్రతినిధులకు చేరవేశారు. స్పందించిన లయన్ వెంకటసుబ్బయ్య, సంజీవరెడ్డిలు రూ.22వేలు మొత్తాన్ని బాధితురాలికి అందించారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, వెంకటేశ్వర రావు. రఘు పాల్గొన్నారు.

'ఏడీ సుబ్బారావు సేవలు మరువలేనివి'


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కడప(రూరల్) మే 31 : వ్యవసాయ శాఖలో ఏడీగా సుబ్బారావు అందించిన సేవలు మరువలేనివని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పే ర్కొన్నారు. కడప డివిజన్ ఏడీగా పనిచేస్తున్న సుబ్బారావు శుక్రవారం పదవీవిరమణ చెందారు. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ హాలులో నిర్వహించిన పదవీ విరమణ సభ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏడీఏ సుబ్బారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో తోటి ఉద్యోగుల సహాయ సహకారాలు మరువలేనివన్నారు. వ్యవసాయరంగమంటే తనకు ఎంతో మక్కువని, పదవీ విరమణ చెందినప్పటికీ తగిన సేవలను అందిస్తానన్నారు. అనంతరం సుబ్బారావు దంపతులను జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఏడీలు, డీడీలు, ఏఓలు సత్కరించారు.

అనుమతి లేని కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

● ఎస్ఎఫ్ఐ, డీవై ఎఫ్ఐ

కడప (సెవెన్‌రోడ్స్), మే 31:కడప నగరంలోని దుర్గమ్మ గుడి వద్ద ప్రభుత్వ గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, ముడియం చిన్ని, వీరనాల శివకుమార్, సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా అ డ్మిషన్లు నిర్వహిస్తున్న స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, మనోజ్, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అంజి పాల్గొన్నారు.

'రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న సజ్జలపై చర్యలు తీసుకోవాలి'

కమలాపురం రూరల్, మే 31 :ఓటమి భయంతోనే దాడులు చేయాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సజ్జల రామక్రిష్ణారెడ్డికి తగదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చున్న వారు గట్టిగా వాదించేవారుగా ఉండాలని చెప్పడం దాడులకు ఉసి గొల్పడమేనన్నారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని కవ్వింపు చర్యలు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరపాలని డిమాండ్ చేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు

నేటి నుంచి తనిఖీలు

కడప (నాగరాజుపేట), మే 31 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జూన్ 1 నుంచి 30 వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. గురువారం కార్మిక శాఖ అధికారులతో పాటు డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలు, వా ణిజ్య సంస్థలు, హోటళ్లు, సినిమా థియేటర్లు, మెకానిక్ షాపులు, వెల్డింగ్ షాపులు బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్మికశాఖ చట్టాలకు వ్యతిరేకంగా బాలబాలికలు పనిచేసినట్లు అధికారులు గుర్తిస్తే ఆయా యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'రంగాచార్లును ఆదర్శంగా తీసుకోవాలి'


రంగాచార్ల దంపతులను సత్కరిస్తున్న సీఈఓ సుధాకర్‌రెడ్డి

కడప(రూరల్) మే 31 : జిల్లా ప్రజాపరిషత్ శాఖలో వివిధ క్యాడర్లలో పనిచేసి పదవీవిరమణ పొందిన ఎం.వి.రంగాచార్లును ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, మాజీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి పేర్కొన్నారు. జడ్పీ కేంద్ర కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఎం.వి. రంగాచార్లు శుక్రవారం పదవీవిరమణ చెందారు. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ హాలులో జరిగిన సన్మానసభకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విధుల పట్ల రంగాచార్లు ఎంతో బాధ్యతగా వ్యవహరించేవారన్నారు.

36 సంవత్సరాలు జిల్లా ప్రజాపరిషత్ శాఖలో వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం సేవలందించారన్నారు. రంగాచార్లు మాట్లాడుతూ జిల్లా ప్రజాపరిషత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం రంగాచార్ల దంపతులను గండి ఆంజనేయ స్వామి దేవస్థానం ఈఓ ముకుందారెడ్డి పర్యవేక్షణలో వేదపండితులు ఆశీర్వచనాలు చేశారు. రంగాచార్ల దంపతులను ఘనంగా సత్కరించారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో మార్పులు

ప్రొద్దుటూరు టౌన్, మే 31: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ఆప్షన్ల ఎంపికలో మార్పులు జరిగినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీన జరగవలసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన 6వ తేదీకి వాయిదా పడిందన్నారు. 31 శుక్రవారం నుంచి జరగాల్సిన ఆన్‌లైన్‌లో ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ జూన్ 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జూన్ 14 నుంచి పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

నేడు హనుమత్ జయంతి వేడుకలు

ముద్దనూరు మే31: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.ముద్దనూరు టౌన్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, చింతకుంటలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.ఉదయం నుంచి ఆకు పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కోరారు.

చాపాడు..: మండలంలోని సీతారామాపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల వద్ద ఉన్న అభయ ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఈనెల శనివారం హనుమత్‌జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆంజనేయస్వామికి కలశస్థాపన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు,చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పదవి విరమణ తప్పనిసరి

బద్వేలు, మే 31:ప్రతి ఉద్యోగికి పదవివిరమణ తప్పనిసరి అని సాంఘీక సంక్షేమ డిప్యూటి డైరెక్టర్ సరస్వతి పేర్కొన్నారు. బాలికల హాస్టల్‌వార్డన్ బాలమ్మ పదవి విరమణ పొందిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ కార్యకమంలో ఏఎస్‌డబ్ల్యుఓ రామయ్య, దిలీప్‌కుమార్, రామాంజనేయులు, ప్రసాద్, బాలు, వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులు రాణింపు

పోరుమామిళ్ల, మే 31 : పుస్తక పఠనంతోనే విద్యార్థులు ఉత్తమ విద్యార్థులుగా రాణిస్తారని రిటైర్డ్‌డిప్యూటీ డీఎంహెచ్‌వో మార్కారెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని గ్రంధాలయంలో జరిగే వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సందర్శించారు.

పారిశుధ్యం అధ్వానం

● కాలువలు దారుణం.. భరించలేని దుర్గంధం.. చర్యలు శూన్యం ● మైదుకూరులో సమస్యలు తిష్ఠ



10 రోజులు అవుతున్నా రోడ్డుపై తీయని పూడిక, రహదారిలో నిలిచిన మురికినీరు

మైదుకూరు, మే 31 :పూడికతో నిండిన కాలువలతో మైదుకూరు దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ పరిధిలో ఏక్కడికి వెళ్లినా, ఏ వీధిలో తిరిగినా పూడికతో నిండిపోయాయి. డ్రైనేజీల్లోని వ్యర్థాలను ఏరోజుకు ఆరోజు తొలగించేవారే కరువయ్యారు. మరి కొన్ని చోట్ల తీసిన పూడిక రోజుల తరబడి వీధుల్లోనే దర్శనమిస్తోంది.

ఈ తతంగమంతా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ దర్శనమిస్తోంది. మున్సిపాలిటీ అయి ఏళ్ళు గడుస్తున్నా మార్పు రావడం లేదు. ఏ ప్రాంతానికి వెళ్ళినా ఎవరిని కదిలించినా పారిశుధ్య సమస్యలే తిష్టవేశాయని, పేరుకే మున్సిపాలిటీ అంతా కంపే అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. మైదుకూరు మున్సిపాలిటీ లో పారిశుధ్యసమస్యలు తాండవిస్తున్నాయి. పొట్టి శ్రీరాముల సర్కిల్ నుంచి కడప రోడ్డులోని సాయిబాబా ఆలయం వరకు దాదాపు 30 వీధులు, ప్రొద్దుటూరు రోడ్డులోని సంత రోడ్డు, మూలబాట వీధి, పాతూరు, శివునిమాన్యం, జోసఫ్‌పేట, శాంతినగర్, వెంకటసుబ్బయ్య కాలనీ, ఇందిరమ్మకాలనీ, చిలుంగారివీధి, వాసవీనగర్, రేణుకా యల్లమ్మవీధి ఇలా ఏక్కడ చూసినా పారిశుధ్య సమస్యలే కన్పిస్తాయి. మురుగు కాలువలు పలు చోట్ల ధ్వంసమైనా పునరుద్ధరణకు నోచుకోలేదు. మరి కొన్ని చోట్ల రోడ్డుకన్నా కాలువలు ఎత్తులో ఉండటంతో నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. మరి కొన్ని వీధుల్లో మురుగు కాలువలను స్థానికులు ఆక్రమించేశారు.

ప్రతి మున్సిపల్ సమావేశంలోనూ ప్రతిపక్ష టీడీపీ సభ్యుల తో పాటు అధికార పార్టీ సభ్యులు కూడా పారిశుధ్య సమస్యలపై లేవనెత్తుతున్నా అధికారుల్లో చలనం లేదు. కార్మికుల జీతభత్యాల పెంపుపై తీర్మాణంలో పెట్టి ఆమోది స్తున్నా పారిశుధ్య చర్యల్లో ఏమాత్రం మెరుగుకనపడలేదు.

విజృంభిస్తున్న దోమలు..: పూడిక నిండిన కాలువలతో మైదుకూరులో దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువలు వ్యర్థాలతో ఉండ టం, వాటి పర్యవేక్షణ లేకపోవడంతో పాటు కనీసం ఫాగింగ్ కూడా చేయక పోవడంతో దోమలు వ్యాప్తి పెరుగుతోంది. వర్షకాలం మొదలు కావడంతో కాలువలు మురుగు కూపాలుగా మారుతాయి.

వెలగని వీధిలైట్లు..: మున్సిపల్ పరిధిలోని పలు వీధుల్లో వీధి లైట్లు వెలగడం లేదు. వీధిలైట్ల బాధ్యత తగిన కాంట్రాక్టరు చూసుకోవాల్సి ఉన్నా పర్యవేక్షణ లేదు. అలాగే అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో స్థానికులు రాత్రి సమయాల్లో చీకటిలో నడుస్తున్నారు. విష పురుగులు తిరుగుతూ ప్రమాదాలు తావిస్తాయని వాపోతున్నారు.

సిబ్బంది తక్కువ.. పని చేయని యంత్రాలు :

దాదాపు 45 వేల మంది జనాభా కల్గిన మున్సిపాలిటీలో 100కు పైగా సిబ్బందితో పాటు పలు యంత్రాలు పని చేయడం లేదు. రెండు పెద్దవి, ఒక చిన్న ట్రాక్టర్‌తో కంపోస్టు తీసుకపోతున్నాం. సిబ్బందికూడా తక్కువగా ఉన్నారు. వీలైనంత పారిశుధ్యపు పనులు చేసుకొంటూ పోతున్నాం. కొత్త వాహనాలు కొనుగోలు చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

పెంచలప్ప, పారిశుధ్య అధికారి

టైపు ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 31: టైపులో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ పి.గౌరీశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 20 సంవత్సరాలుగా గ్రూప్-3, 4 పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్టు, కారుణ్య నియామకాలతో సరిపెడుతోందని దీనితో టైపులో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు నష్టపోతున్నారని తెలిపారు. అలాగే 2024 మార్చి 12న రాష్ట్ర ప్రభుత్వం జీవోనెం.26, 27, 28లను జారీ చేసి టైపు ఉత్తీర్ణులైనవారికి నష్టం కలిగిస్తోందన్నారు. ఆ జీవోల ద్వారా గ్రూప్-2, 3, 4 ఉద్యోగాలకు టైపు అర్హతను తొలగించి సీపీటీ కోర్సు పాస్ కావాలని నిబంధన విధించడం దారుణమన్నారు. టైపు ఉత్తీర్ణత సాధించినవారిని దృష్టిలో ఉంచుకుని జీవోనెం.26, 27, 28లను రద్దు చేసి పాత పద్ధతిలోనే గ్రూప్-2, 3, 4 నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భరత్, రాహుల్, ప్రేమ్‌స్వరూప్ పాల్గొన్నారు.

కడప కొత్తబస్టాండు మీదుగా బస్సులు నడపాలి

ప్రొద్దుటూరు, మే 31 : ప్రొద్దుటూరు నుంచి కడపకు కమలాపురం మీదుగా వెళ్ళే బస్సులు కడప ఆర్టీసీకొత్త బస్టాండ్ మీదుగా నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఈ సర్వీసు బస్సులను ప్రొద్దుటూరు నుంచి కమలాపురం మీదుగా కడప కొత్త బస్టాండుకు వెళ్లకుండా నేరుగా పాత బస్టాండుకు వెళుతున్నాయి. దీంతో కడప ఆర్టీసీ కొత్త బస్టాండ్ మీదుగా బస్సులు రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు ప్రయాణీకులు వాపోతున్నారు. ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్ల, కమలాపురం, వల్లూరు మీదుగా కడపకు వచ్చేవారు ముఖ్యంగా కాలేజీలు, స్కూల్లు, హాస్పిటల్స్ , కలెక్టర్ ఆఫీసు వెళ్ళటానికి కడపలో కొత్త బస్టాండుకు వెళ్లడం వలన వీరందరికి సౌలభ్యంగా వుంటుందని చెబుతున్నారు. కోటిరెడ్డి సర్కిల్‌మీదుగా నేరుగా పాతబస్టాండ్‌కు వెళ్ళడం వలన ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా వుందని తెలియజేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ సమస్యను పరిగణలోకి తీసుకుని ప్రొద్దుటూరు నుంచి కమలాపురం మీదుగా కడపకు వచ్చే బస్సులను కొత్త బస్టాండ్ మీద నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడితే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

జమ్మలమడుగు, మే 31: జూన్ 4వ తేదీ కడపలో నియోజకవర్గానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పక్రియ జరుగనుందని ఆరోజు జమ్మలమడుగులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తప్పవని జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ సూచించారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కౌంటింగ్ రోజు జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీల్లో పూర్తిగా కర్ఫ్యూ ఉంటుందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎవరు బయటికి వచ్చి గుంపులుగా నిలబడటం, మాట్లాడటం చేయరాదన్నారు. పట్టణాల్లో ఇప్పటికే దుకాణదారులకు నోటీసులు ఇచ్చామని, ఎవ్వరు షాపులు తెరువరాదని ఆదేశాలు ఇవ్వడంతో స్వచ్ఛందంగా వ్యాపారస్థులు కౌంటింగ్ రోజు దుకాణాలు మూసివేస్తామని చెప్పారన్నారు. ఎర్రగుంట్ల, జమ్మలమడుగు మున్సిపాలిటీల్లోకి బయటి ప్రాంతాల నుంచి ఎలాంటి వాహనాలు ప్రవేశం లేకుండా పోలీసు బందోబస్తు తనిఖీ ఉంటుందన్నారు. ఎక్కడ చూసినా నిర్మాణుష్యంగా ఉండాలని, జనాలు బయటకు రాకూడదని, అయిదుగురికి మించి గ్రామాల్లో నిలబడి మాట్లాడినా తమ సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు. పెట్రోలు బంకుల్లో లూజు విక్రయాలు చేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 3, 4, 5 తేదీల్లో నిబంధనలు వస్తే ఆ మూడు రోజులు కూడా చర్యలు ఉంటాయన్నారు. ప్రస్తుతం కౌంటింగ్ 4వ తేదీ ఆ రెండు మున్సిపాలిటీల్లో ప్రత్యేక సిబ్బందితోపాటు 400 మందికిపైగా పోలీసులు విధుల్లో ఉంటారన్నారు. 11 మొబైల్‌పార్టీలు, సిబ్బంది నిత్యం తిరుగుతారన్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో హెచ్చరికలు చేశామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సంఘటనకు బాధ్యులైనవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. హౌస్ అరెస్టులు చేస్తామని, ఇప్పటికే 32 మందిని గుర్తించి తగిన చర్యలు చేపట్టామన్నారు. గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడినవారిని గ్రామ బహిష్కరణ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. సోషల్ మీడియాలో ఏదైనా పోస్టులు పెట్టినా, కౌంటింగ్‌రోజు ఫలితాలకు సంబంధించి ఇతరులకు పోస్టులు తెలియజేయడం, తదితర వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టినా వెంటనే కేసు నమోదు, రిమాండ్‌కు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొబెషనరీ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ కరుణాకర్, ఎస్‌ఐ కల్పన తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

కొండాపురం, మే 31; జూన్ 4 న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలకు అనుమ తి లేదని కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు. జూన్ 4 నుండి కఠినమైన కర్ఫ్యూ అమలులో ఉంటుం దని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇళ్లు విడిచి ఎవరూ బయటకు రాకుడదన్నారు. 6 వతేది వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

పెన్షన్.. టెన్షన్..?

లబ్ధిదారుల్లో మొదలైన ఆందోళన ● ప్రభుత్వతీరుపై విమర్శలు



బ్యాంకుల్లో క్యూలో ఉన్న పెన్షన్‌దారులు(ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, మే 31 : ఎండలు మండిపోతున్నాయి, ఉక్కపోతతో జనం విలవిలలాడిపోతున్నారు. గడపదాటి బయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. ఓ వైపు కాస్త మబ్బులు ఉంటున్నా... ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతున్నాయి. ఇవేమి ప్రభుత్వానికి పట్టడంలేదు. వృద్ధులు, వికలాంగులన్న కనికరంకూడా చూపడంలేదు. ఎన్నికలు ముగిశాయి, ఈ నెల 4వ తేదీన ఓట్లలెక్కింపు జరుగుతుంది. 6వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుంది. ఈ నేపథ్యంలో జూన్ నెల పెన్షన్ల పంపిణీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. వలంటరీ సేవలకు ఎన్నికల కమిషన్ అనుమతిస్తుందా... గత నెల మాదిరి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందా... లేక సచివాలయాలకు ఇస్తారా అనే అంశాలపై పెన్షన్ దారుల్లో టెన్షన్ నెలకొంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు ప్రభుత్వం వలంటరీలతో ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేయించింది. ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో రెండు నెలలుగా వలంటీర్లచేత పంపిణీని నిలిపివేయించింది. దీంతో దివ్యాంగులు, వృద్ధులు నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు పెన్షన్ల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి వడదెబ్బతో మృత్యువాతపడ్డారు. దీంతో మే నెలలో లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. చాలా మందికి 10వ తేదీ వరకు జమకాలేదు. కొందరికి ఆధార్‌తో బ్యాంకు అకౌంట్ లింకుకాకపోవడంతో, మరి కొందరికి రెండు, మూడు ఖాతాలు ఉండటంతో ఏ ఖాతాలో పడిందో తెలియని స్థితిలో బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. గ్రామాల నుంచి పట్టణాల్లోకి వచ్చి బ్యాంకుల్లో నగదు తీసుకోవాల్సిరావడంతో వ్యయప్రయాసలకు గురికావడంతోపాటు ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో జూన్ నెల పెన్షన్‌పై లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది.

ఇలాగైతే ఎలా సారూ..? ..: బ్యాంకులు, సచివాలయాలకు వెళ్లి పెన్షన్ తీసుకోవడానికి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మందికి బ్యాంకు వ్యవహారాలపై అవగాహన లేక అవస్థలు పడ్డారు. ఈ సారి ఇలాగైతే తమ పరిస్థితి ఏమిటని పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బందితో ఇళ్ల వద్ద పెన్షన్లు అందించేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

ఏఎస్‌ఐ సుబ్బారెడ్డికి ఘన సన్మానం

రాజుపాలెం, మే 31 : రాజుపాలెం మండలంలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న సుబ్బారెడ్డికి శుక్రవారం స్టేషన్ లో ఘనసన్మానం చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ 37 సంవత్సరాలుగా డిపార్ట్‌మెంటుకు సేవలందించి ఈ రోజు రాజుపాలెంలో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నాగతులసి ప్రసాద్, ట్రాఫిక్ సీఐ యుగంధర్, ములుగుబ్బ సీఐ బాలాజీ నాయక్, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

136 మంది ట్రబుల్ మాంగర్స్ గుర్తింపు: డీఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం, మే 31 : మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంలో 136 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించామని ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రండీఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆరుగురిని జిల్లాబహిష్కరణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏ పార్టీ వారైనా ఇబ్బందికరమైన పరిస్థితులు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బైండోవర్ పెట్టిన వారిపై మరలా కేసులు నమోదైతే వారి ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బాణసంచా నిషేధాలు ఉంటామని, ఎవ్వరు పేల్చినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. పట్టణంలో 64 సీసీ కెమెరాలు పనిస్తాయని తెలియజేశారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన రూల్స్ విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సీఐలు యుగంధర్, శ్రీకాంత్, అబ్దుల్ కలీం, రమణారెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనాలు



పాఠశాల ఆవరణలో నిలువ ఉన్న వ్యర్థాలు



జమ్మలమడుగు, మే 31: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల భవనాలు నిరుపయోగంగా మారాయి. ఆ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుని ఉన్నాయి. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు రోడ్డులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు వాటి ఆవరణంలో వ్యర్థాలు నిండాయి. దీంతో విషపురుగులు చేరి స్థానికులకు ఇబ్బందికరంగా మారుతోంది. అలాగే కూరగాయల మార్కెట్ సమీపాన, గంగమ్మ దేవాలయం వెనుకభాగాన ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు నిరుపయోగంగా మారాయి. పాఠశాల ఆవరణలో మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని నిరుపయోగంగా ఉన్న పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని పలువురు వాపోతున్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మందుబాబుల తాడికి అధికంగా ఉందని రాత్రి సమయంలో సముదాయంలోని వివిధ ప్రభుత్వ భవనాల వద్ద మద్యం తాగేవారు వస్తున్నారని పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిల సాక్ష్యాలు..!

నిరుపయోగంగా మారుతున్న ప్రభుత్వ భవనాలు ● లక్షలాది రూపాయలు ప్రజాధనం వృథా

పెద్దముడియం, మే 31 : చాలా చోట్ల ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన భవనాలు లేక యంత్రాంగం అవస్థలు పడుతూ విధులు నిర్వహిస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా పెద్దముడియం మండలంలో పలు ప్రభుత్వభవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ అధికార యంత్రాంగం అంతులేని నిర్లక్ష్యానికి శిథిలభవనాలు సాక్ష్యం.

ఎమ్మార్సీ భవనం..: మండల కేంద్రం పెద్దముడియంలో విద్యాశాఖకు ఎమ్మార్సీభవనం ఏర్పాటు చేశారు. అయితే పది సంవత్సరాలుగా ఆ భవనానికి తాళం వేసి గుండకుంటలోని ప్రాథమికపాఠశాలలోని ఓ గదిలో విద్యాశాఖ కార్యకలాపాలు సాగిస్తూ ఎమ్మార్సీ భవనాన్ని గాలికి వదిలేసింది. దీంతో ఆ భవనం శిథిలమై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

పశువైద్యశాల..: పాలూరులో ఉన్న పశువైద్యశాల ఉపకేంద్రం శిథిలావస్థకు చేరడంతో అక్కడ సుమారు 8లక్షలు వెచ్చించి ఆరు సంవత్సరాల క్రితం నూతన భవనం నిర్మించారు. అయితే అది నేటి వరకు ప్రారంభానికి కూడా నోచుకోకపోవడం గమనార్హం. ఉన్న భవనం శిథిలావస్థకు చేరడం, నూతన భవనం ప్రారంభం కాకపోవ డంతో గ్రామంలోని పశుపోషకులు వైద్యసేవలు అందక అవస్థలు పడుతున్నారు.

బాలుర వసతిగృహం..: పెద్దపసుపుల గ్రామంలో బాలుర వసతిగృహంలో విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో వేరే చోటకు బదిలీ చేశారు. అంతటితో తమ పని అయిపోయిందన్న తీరుతో అధికారులు ఆ భవనాన్ని గాలికి వదిలేశారు. దీంతో ఆ భవనం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. చుట్టూ ప్రహరీ, తరగతి గదులు ఉన్న ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి అధ్వానంగా కనిపిస్తోంది.

అంగన్వాడీ కేంద్రం..: పెద్దపసుపులలోని ఎన్.కొట్టాలపల్లె దారిలో ఒకే చోట రెండు అంగన్వాడీ కేంద్ర భవనాలు నిర్మించారు. ఒక భవనాన్నిమాత్రం ప్రారంభించి మరొక దానిని గాలికి వదిలేశారు. ఒకే చోట రెండు భవనాలు నిర్మించరాదన్న నిబంధన ఉన్నా ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టరు ఒకే చోట రెండు భవనాలు నిర్మించారు. దీంతో ఒక భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారిపోయింది. అలాగే పెద్దముడియంలోని ప్రాథమిక పాఠశాల తరగతి గది కూడా ఉపయోగించకుండా ఉండడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇలా లక్షలాది రూపాయల ప్రజాధనంతో వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరినా అధికార యంత్రాంగాన్ని నిర్లక్ష్యం ఆవహించింది.



పెద్దముడియంలోని ఎమ్మార్సీ భవనం, పెద్దపసుపులలోని అంగన్వాడీ కేంద్రం, బాలుర వసతిగృహం